క్లుప్తంగా

77 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు



సత్యవాడ హైస్కూల్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది, హెచ్‌ఎం

ఉండ్రాజవరం: విద్యార్థులు తమ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సత్యవాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.సూర్యకాంతం అన్నారు. నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా బుధవారం ఆ పాఠశాల విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సూర్యకాంతం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాష్ గురించి వివరించారు. సత్యవాడలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో ఈ నెల 17న నులి పురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఆరోజు పాఠశాలలకు రాని 77 మంది విద్యార్థులతో బుధవారం మాత్రలు మింగించామని ఉండ్రాజవరం పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆ పీహెచ్‌సీ సిబ్బంది ఎస్‌కే సుభాషిణి, పి.బ్యూలా జోయ్, దుర్గా మల్లేశ్వరి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

పెరవలి: ఐసీడీఎస్ పెరవలి ప్రాజెక్టు పరిధిలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో ఖాళీగా ఉన్న 11 అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని సీడీపీఓ డి. శ్రీలక్ష్మి బుధవారం తెలిపారు. పెరవలిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు మొదలవుతాయన్నారు. ఈ 11 పోస్టుల కోసం 24 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వాటిలో 5 పోస్టులు ఓపెన్ కేటగిరీకి, నాలుగు పోస్టులను బీసీలకు, మిగిలిన రెండు పోస్టులను ఎస్సీలకు కేటాయించినట్లు ఆమె వివరించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్థానికుడు లింగాల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను బుధవారం జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డి.సువర్ణరాజు, ఆ పార్టీ శ్రేణులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయం, నాలుగు బస్తాల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ దేవరపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల సత్తిబాబు, మండల ఉపాధ్యక్షుడు చప్పటి శివ, మాధవరపు వెంకటేశ్వరరావు, జాజిమొగ్గల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాల్లో సవరణపై సమీక్ష

పెరవలి: ఓటరు జాబితాలో కొత్తగా చేర్పులు, మార్పులు, తొలగింపులపై తహసీల్దార్ డి.అచ్యుతకుమారి బుధవారం మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్‌వో)తో సమావేశమయ్యారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నివాసం ఉండని వారి ఓట్లను తొలగించాలని, ఒక చోట నివాసం ఉంటూ, మరోచోట ఓటు హక్కు ఉంటే ఓటును బదిలీ చేయించాలన్నారు. ఈ ప్రక్రియలో బీఎల్‌ఓలు ఎంతో నేర్పుగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఏఎస్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఆటల పోటీలకు 'శశి' విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన వేలివెన్ను శశి క్యాంపస్ విద్యార్థులు

ఉండ్రాజవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిడదవోలు జెడ్పీ హైస్కూల్లో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి అండర్-17, అండర్-14 బాలబాలికల విభాగాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు శశి వేలివెన్ను విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ బుధవారం తెలిపారు. అండర్ -17 బాలుర వాలీబాల్, కబడ్డీ, యోగా, చదరంగం, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, షాట్‌పుట్, 100 మీటర్ల పరుగు పందెం విభాగాల్లో తమ విద్యార్థులు సత్తా చాటారన్నారు. అలాగే అండర్-17 బాలికల కబడ్డీ, యోగా, ఖోఖో, 400 మీటర్ల పరుగు పందెం, డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఇక అండర్ -14 బాలుర యోగా, ఖోఖో,100, 200 మీటర్ల రన్నింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. అలాగే అండర్-14 బాలికల ఖోఖో,100 మీటర్స్ రన్నింగ్ పోటీల్లో తమ విద్యార్థినులు సత్తా చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. వారిని, వ్యాయామో పాధ్యాయులను ఆ విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్, వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ, ప్రిన్సిపాల్ షేక్ షానూర్ అభినందించారు.

ఖరీఫ్ వరిపై తెగుళ్ల దాడి

- వాతావరణంలో వచ్చిన మార్పులే కారణం
- నాలుగు రకాల తెగుళ్లు గుర్తించిన ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నరసింహారావు
- రైతులకు సస్యరక్షణ చర్యల సిఫారసు



నరసింహారావు, జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాజమండ్రి



పెరవలి మండలం ఉసులుమర్రులో సుడి దోమ సోకి ఎండిపోతున్న వరి పైరు



పెరవలిలో ఎండాకు తెగులు సోకిన వరి పైరు



కాకరపర్రులో అగ్గి తెగులు సోకిన వరి పంట

పెరవలి: వాతావరణంలో వచ్చిన మార్పుల ప్రభావంతో ఖరీఫ్ వరి పంటకు తెగుళ్లు సోకాయి. భారీవర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు ఇందుకు ప్రధాన కారణం. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తుండగా, నిడదవోలు నియోజకవర్గంలో 36 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగులో ఉంది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వరి పైరును పరిశీలించిన జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్‌వీ నరసింహారావు(రాజమహేంద్రవరం) ఈ పంటను తెగుళ్లు ఆశించినట్టు గుర్తించారు. ప్రధానంగా ఎండాకు, సుడిదోమ, తుప్పు, మాగుడు వంటి నాలుగు తెగుళ్లు ఆశించాయని ఆయన వివరించారు. అధిక వర్షాల వలన బీపీటీ- 5204, పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1318, 1282, 1121,1224 రకం వంగడాలకు తెగుళ్లు సోకాయని చెప్పారు. అలాగే సాగులో నత్రజని అధికంగా వాడడం, పొటాష్ వాడకపోవడం వలన స్వర్ణ, పీఆర్ 126 రకాలకు తెగుళ్లు వ్యాప్తి చెందాయన్నారు.

ఎండాకు తెగులు.. నివారణ

ఈ తెగులు బాక్టీరియా వల్ల వస్తుంది. ఇది ఆకుల అంచుల నుంచి పసుపు రంగుకు మారి ఆకులు క్రమేపీ ఎండిపోతాయి. ఈ తెగులు అధిక వర్షాలు కురిసినపుడు, గాలిలో తేమశాతం అధికంగా ఉన్నపుడు సోకుతుంది. ఈ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కాపర్ హైడ్రాక్సైడ్ మందును ఎకరాకు 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మరలా కనిపిస్తే రెండు వారాల తరువాత మరోసారి పిచికారీ చేయాలి.

మాగుడు లేక పొడ తెగులు

అధిక ఎండలు, గాలిలో తేమశాతం 90 శాతం ఉన్నపుడు ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు సోకిన పైరు చూస్తుండగానే ఎండిపోతుంది. నివారణకు ఎకరానికి ఎక్సోకొనోజాల్ 400 మిల్లీలీటర్ల మందును పిచికారీ చేయాలి. లేదా పిప్రీకొనోజాల్ 200 మిల్లీలీటర్లు లేదా వాలిడామైసిన్ 400 మిల్లీ లీటర్ల మందును ఒక మిల్లీ లీటరు 2 లీటర్ల నీటికొ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. 15 రోజుల తర్వాత రెండోదఫా పిచికారీ చేయాలి.

తుప్పు తెగులు

ఈ తెగులు సోకిన వరి పైరుపై గోధుమ వర్ణంలో తుప్పు పట్టినట్టుగా మచ్చలు ఏర్పడతాయి. అవి క్రమేపీ పెద్దవై ఆకులో పత్రహరితాన్ని హరిస్తాయి. తొలుత ఆకులు, క్రమేపీ వరిదుబ్బు ఎండిపోతాయి. దీని నివారణకు ఎకరానికి 250 గ్రాముల కార్బండైజిం పొడిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వారం రోజుల తర్వాత కూడా మచ్చలు ఉన్నట్టయితే మరోసారి పిచికారీ చేయాలి.

అగ్గితెగులు

గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నపుడు ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. వరి ఆకులపై ముదురు గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు ఎండిపోయి తగలబడినట్టుగా కనిపిస్తాయి. వెన్ను మెడ భాగంలో ఈ తెగులు వ్యాపిస్తుంది. వెన్ను విరిగిపోతుంది. ఎరువుల్లో నత్రజని ఎక్కువైనపుడు కూడా ఈ తెగులు సోకవచ్చు.

ఈ తెగులు ఆశించిన పైరు చుట్టూ గట్లపై గడ్డిని నివారించాలి. ట్రైసైక్లోజోల్ 6 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ తెగులు

సుడిదోమ వరి మొక్కల కాండం మొదళ్లలో చేరి రసం పీల్చడం వల్ల ఆకులు పసుపు రంగులోకి మారి పంట సుడులు సుడులుగా ఎండిపోతుంది. ఒక్కో వరిదుబ్బుకు 10 నుంచి 15 దోమలు ఉంటే ఎకరానికి పై మెట్రోజోల్ 120 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిదుబ్బుకు 25 నుంచి 50 దోమలు ఉంటే హితోఫిన్ ప్లాక్స్ ఎకరానికి 300 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిదుబ్బుకు 50కు పైబడి దోమలు ఉంటే ఎస్పేట్ ఎకరానికి 300 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లు



బస్ పాస్‌లు పొందిన విద్యార్థులతో దూబచర్ల సర్పంచ్ బాలయ్య తదితరులు

నల్లజర్ల: వివిధ గ్రామాల నుంచి దూబచర్ల హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులకు బుధవారం ఉచిత బస్ పాస్‌లు అందజేశారు. ఇందుకయ్యే ఖర్చును దూబచర్లకు చెందిన రాజా జ్యూవెలర్స్ అధినేత గాదె వల్లయ్య రాజా ఆర్టీసీకి చెల్లించారు. హెచ్‌ఎం సుమతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బస్‌పాస్‌లను సర్పంచ్ తాడిగడప బాలయ్య విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కూచిపూడి ఉదయభాస్కరావు, ఎస్‌ఎం సీ చైర్మన్ కొండేటి రాజేష్, ఆర్టీసీ పీఆర్వో విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్ పాస్‌ల దాత వల్లయ్య రాజాను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

28న కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: స్థానిక మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్ పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు ప్రకటించారు. సభ్యులంతా విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయం



ఖండవల్లిలో నీట మునిగిన దొండ పాదులు

పెరవలి: మండలంలో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయం కావడమే గాకుండా, పంట చేలు నీట మునిగాయి. భారీ వర్షానికి రోడ్లు కాలువల్లా దర్శనం ఇచ్చాయి. మండలంలో కానూరు, నడుపల్లి, తీపర్రు, కానూరు అగ్రహారం, ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో చేలల్లో మోకాలి లోతు నీళ్లు నిలిచాయని రైతులు తెలిపారు.

మందు బాబులకు నెలవుగా..



తాడిపూడిలోని బస్ షెల్టర్

తాళ్లపూడి: తాడిపూడి గ్రామంలోని బస్ షెల్టర్‌లో మందుబాబులు వీరంగం చేస్తున్నారు. దాంతో బస్సుల కోసం ఇక్కడ వేచి ఉండే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.మందుబాబుల చర్యలతో బస్‌షెల్టర్ అపరిశుభ్రంగా తయారవుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏటిగట్టుపై రామాలయం పక్కనే ఉన్న ఈ బస్ షెల్టర్ రాత్రిపూట మందుబాబులకు నెలవుగా మారింది. ఉదయం బస్‌ల కోసం వచ్చే ప్రయాణికులు బస్‌షెల్టర్‌లో ఖాళీ మద్యం సీసాలు, ఖాళీగ్లాసులు, దర్శనం ఇస్తున్నాయి.తాగేసిన మద్యం సీసాలను సైతం పగలగొడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్యవైశ్యుల ప్రతిష్ట పెంచేలా పనిచేస్తా

పట్టణ శాఖ నూతన అధ్యక్షుడు మట్టే ప్రసాద్



కొవ్వూరు ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడు మట్టే ప్రసాద్, ఇతర కార్యవర్గం

కొవ్వూరు: ఆర్యవైశ్యుల ప్రతిష్ట పెంచేలా పని చేస్తానని, సంఘ సభ్యుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని కొవ్వూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మట్టే వీర వెంకట వరప్రసాద్ పేర్కొన్నారు. పట్టణ ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తానని, ఎంతో నమ్మకంతో తనకు అప్పగించిన ఈ పదవిని బాధ్యతగా నిర్వర్తిస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం నూతన కార్యదర్శిగా కొల్లేపర వెంకటేశ్వరరావు (శ్రీనివాస్), కోశాధికారిగా తుమ్మలపల్లి నాగ రమేష్, వాసవీ ట్రస్టు చైర్మన్‌గా కక్కిరాల సోమయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన నాగవరపు మహేష్ ప్రకటించారు. సంఘం నాయకులు సత్యవరపు గోపాలకృష్ణ, పూర్వపు అధ్యక్షుడు మద్దుల సోమరాజు, మద్దుల సత్యనారాయణ, ఎంబీఎస్ ప్రసాద్ (దత్తుడు), నాళం వీర వెంకట శ్రీనివాస్, కక్కిరాల సూరిబాబు, వలివేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దీనదయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నివాళి



కొవ్వూరులో దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



నిడదవోలులో దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: అంత్యోదయ సిద్ధాంతం ద్వారా చిట్ట చివరి వ్యక్తుల వరకూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని సంకల్పించిన నేత జన్ సంఘ్ (ప్రస్తుత బీజేపీ) మాజీ జాతీయ అధ్యక్షుడు దీనదయాళ్ ఉపాధ్యాయ అని వక్తలు కొనియాడారు. పట్టణంలోని పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో బుధవారం దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ మట్లా ఆంజనేయులు, కో-కన్వీనర్ బీవీ ముత్యాలరావు, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి తాడిమళ్ల విజయవాణి, మండల శాఖ అధ్యక్షుడు పెరుగు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం స్థానిక పాటిమీద సెంటర్లోని అన్న క్యాంటీన్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రంగా వెంకటేశ్వరరావు అన్న క్యాంటీన్‌లో ఒకపూట టోకెన్ల ఖర్చు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యవాడలో సామూహిక సీమంతాలు



సత్యవాడలో సీమంతాల కార్యక్రమంలో మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం: ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకుని గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మ ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పౌష్టికాహార వేడుకల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సత్యవాడలో 9 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో కలసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ గర్భిణులకు చీర, సారె అందజేశారు. ఒక చిన్నారికి అన్నప్రాసన చేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సత్యవాడ బాలజ్యోతి, మోర్త నవోదయ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన రూ.61వేలు, సత్యవాడ డ్వాక్రా సభ్యులు సేకరించిన రూ.45 వేల చెక్కులను మంత్రి చేతికి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుకూరి దేవీభార్గవి, ఉప సర్పంచ్ ప్రసాద్‌రాజు, ఐవీఎస్ రాజు, సింహాద్రి రామకృష్ణ, కాకర్ల నాని, ఎంపీడీవో జీఆర్కే రాజు, సీడీపీవో శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

కొవ్వూరు: తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో రాజకీయ లబ్ధి కోసమే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవి ప్రకాష్ అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంపై రాజకీయాలు మాని సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. తయారీలో కొవ్వు పదార్థాలు వాడితే లడ్డూలు చెడిపోతాయని కర్ణాటక పుణ్య క్షేత్రాల క్వాలిటీ కంట్రోలర్ ప్రకాష్ కుమార్ స్పష్టంగా చెప్పారన్నారు. హిందువులు రోడ్లపైకి రావాలని పవన్ కల్యాణ్ రెచ్చగొట్టేలా పిలుపునివ్వడం సరికాదన్నారు. ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి పెట్టండి

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన
- పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



తాళ్లపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెరవలి మండలం అజ్జరం పొలం పిలుస్తోందిలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

తాళ్లపూడి: వరిపైరును ఆశించిన మాగుడు, ఎండాకు తెగుళ్ల నివారణకు రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జి.రుచిత సూచించారు. మండలంలోని తాళ్లపూడి, కుకునూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ గ్రామాల్లోని రైతులకు వరి పంటకు సోకిన తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ఏవో వివరించారు. అదే విధంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని సూచించారు.

ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రుచిత ఖరీఫ్ వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ప్రస్తుతం వరి పైరుపై మాగుడు, ఎండాకు తెగుళ్లను గుర్తించినట్టు తెలిపారు. అలాగే సుడిదోమ తెగులు నివారణపై కూడా దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమాల్లో పశు వైద్యాధికారి బాలాజీ శంకర్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది డి భీష్మాంబ, నాయకులు నామన పరమేశ్వరరావు, సిబ్బంది రేవతి,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: వరి సాగులో రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి మేరీకిరణ్ సూచించారు. మండలంలోని అజ్జరం, అన్నవరప్పాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల వలన వరి పంటను తెగుళ్లు ఆశిస్తాయన్నారు. రైతులు ప్రతి రోజూ పైరును పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మాచరమ్మ, ఆయా గ్రామాల వ్యవసాయాధికారులు రైతులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో పాలంగి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ బొక్క శ్రీనివాసు అధ్యక్షత వహించారు. ప్రభుత్వం ద్వారా రైతులకు అందుతున్న పథకాల గురించి నిడదవోలు ఏఎంసీ వ్యవసాయాధికారి ఎస్.సత్యవేణి వివరించారు. ప్రతి రైతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా యాంత్రీకరణపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం. విశ్వాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్‌జానీ, సొసైటీ కార్యదర్శి విష్ణు, పి.కాంతి, రైతులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని మార్కొండపాడు, దారవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడులు ఎలా పొందవచ్చో మండల వ్యవసాయాధికారి కె.గోపాలకృష్ణ రైతులకు వివరించారు. వాతావరణ మార్పుల వల్ల వరి పైరుకు సోకిన ఆకు ఎండు తెగులు నివారణకు చేపట్టవలసిన చర్యలను వారికి సూచించారు. డ్రోన్ సాయంతో పురుగు మందుల పిచికారీ ఎలా చేయాలో రైతులకు తెలిపారు. నాణ్యమైన ఎరువుల గురించి వివరించారు. సబ్సిడీపై తమకు స్ప్రేయర్స్, టార్పాలిన్లు ఇప్పించాలని ఈ సందర్భంగా రైతులు ఏవోను కోరారు. పశు సంవర్ధక శాఖ ద్వారా పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, గోకులం షెడ్లు, పెయ్యిదూడల పథకం, సమీకృత మిశ్రమదాణా, గడ్డి కోసే యంత్రాలు వంటి పథకాల గురించి మండల పశువైద్యుడు యు.ముఖేష్ రైతులకు వివరించారు. ఆయిల్‌పామ్ సాగుకు నాలుగేళ్ల పాటు సబ్సిడీపై ఎరువులు ఇస్తామని ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖలకు చెందిన మనోజ్, మంగారావు, శ్రీలత, మౌనిక, విమల, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌లో సస్యరక్షణ చర్యలు



నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామంలో..

నల్లజర్ల: ఆయిల్ పామ్ తోటల్లో వస్తున్న మొవ్వ కుళ్లు, కాయకుళ్లు తెగుళ్ల నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని వెంకట్రామన్నగూడెం కృషీ విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ సూచించారు. మండలంలోని పుల్లలపాడు, అయ్యవరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయిల్‌పామ్‌లో తెగులు సోకిన భాగాన్ని తొలగించి ఒక గ్రాము కార్బండైజమ్ పొడిని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ప్రోఫినోఫిల్ 1.6 మిల్లీ లీటర్ల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో కాండం కుళ్లు నివారణకు హెక్సాకోనజోల్ 2.మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మరో శాస్త్రవేత్త డాక్టరు చిరంజీవి, వ్యవసాయాధికారి కమల్‌రాజ్, ఉద్యాన శాఖాధికారి బబిత, ప్రకృతి వ్యవసాయ నిపుణులు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

నిడదవోలు: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని మంగళవారం స్థానిక వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లోను, స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల్లోనూ నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, పి.ఉషారాణి, బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఏర్పాటైందన్నారు. విద్యార్థులను వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసే విభాగమే ఎన్ఎస్ఎస్ అన్నారు. మహిళా డిగ్రీ కళాశాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కంబయ్య, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.లావణ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో స్వచ్ఛభారత్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.హరీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.యేసురత్నం పాల్గొన్నారు.